


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## *సినిమా సూపిత్త మావా.... నీకూ సినిమా సూపిత్త మావా!*

**కొన్ని తెల్లకాయితాలు కొని మనం** ఒక నవల రాసుకుంటాం. అది పత్రికకో పబ్లిషర్‌కో పంపిస్తాం. ఆ పబ్లిషర్ మనల్ని "ఇది ఏ బడ్జెట్ నవలా?" అని అడగడు.

అదే ఏ టీ.వీ సీరియల్‌కో, సినిమాకో కథ రాస్తుంటే, లేదా చెప్తుంటే "పెద్ద బడ్జెట్టా? చిన్న బడ్జెట్టా?" అడుగుతారు.

ఉదాహరణకి ఒక అబ్బాయి సిటీకి ఉద్యోగానికొచ్చాడు. ఒక కంపెనీలో చేరాడు. ఒక అమ్మాయిని ప్రేమించాడు. స్నేహితుడి కోసం అప్పుచేసాడు. "ఆ అప్పు ఎలా తీరుస్తావు?" అని అప్పు ఇచ్చినవాడు అడిగాడు.

"నా గుండె, కళ్ళూ, కిడ్నీ, ఇన్ని ఖరీదైన విషయాలున్నాయి నాలో నేను కోటీశ్వరుడ్ని. నీకేం కావాలో కోరుకో" అన్నాడు ఆ అబ్బాయి.

"అయితే నీ గుండె, కళ్ళూ కావాలి" అన్నాడు అతను.

హీరోయిన్ కంగారుపడి ఆపబోయింది. అవతల ప్రాణాల మీదకొచ్చింది, హీరో ఆలోచించలేదు, స్టాంప్ పేపర్ మీద సైన్ పెట్టేసాడు. ఇదీ కథ.

కథ వినగానే కొందరికి అజీర్తిగా అనిపించింది. కొందరు

"వెంకటేష్ చేస్తాడా? అతను కాస్త ఉదాత్తమమైన పాత్రలు వేస్తాడు" అన్నారు.

మనసులో బీద కథలు పెద్ద హీరోలు ఒప్పుకోరని నిశ్చయంగా అనుకుని చెప్పారు.

శర్వానంద్‌ని హీరోగా పెట్టి చంద్రసిద్ధార్థ్ అది సినిమాగా తీసాడు. మాటలు నేనే రాసాను. అది బ్రహ్మాండంగా ఆడలేదు. కానీ మంచి సినిమా రచయితల జాబితాలోకి నన్ను చేర్చింది.

మా గురువుగారు పరుచూరి గోపాలకృష్ణగారితో నేను "నాలో ఏదో లోపం గురువుగారూ, నేను చిన్న బడ్జెట్ సినిమాలు తప్ప ఆలోచించలేకపోతున్నా" అన్నా.

దానికి ఆయన ఫెళ్ళున నవ్వి "ఆలోచనకి బడ్జెట్ ఎందుకమ్మా?" అన్నారు.

"నేను మధుమాసం, అందరి బంధువయా రాసినప్పుడు అంతా అదే మాట అన్నారు" అన్నాను.

"నువ్వు చెప్పిన కథ ఇలా మార్చి చెప్పు" అని ఆయన ఓ కథ చెప్పారు.

హీరో పల్లెటూర్లో తండ్రి అప్పులు చేసి జమిందారీ అంతా తగల పెట్టేస్తే తన 64 గదుల ప్యాలెస్‌ని జప్తు నుండి విడిపించుకోడానికి సిటీకొస్తాడు. ఒక ఫ్రెండ్‌ని ఆదుకోడానికి గ్యాంగ్‌స్టర్ దగ్గరకెళ్ళి

"నీ యాభై ఓడలు నాకు అరువు ఇస్తే, నీ సొమ్ము అద్దె, వడ్డీ కలిపి వందకోట్లు చేసి ఇచ్చేస్తా" అన్నాడు.

"అందుకు నాకు ఏం ష్యూరిటీగా పెడ్తావు?" అని ప్రకాష్ రాజ్ లాంటి గ్యాంగ్‌స్టర్ అడిగాడు.

"నా ప్రాణాలు" అన్నాడు.

హీరోయిన్ భయంగా చూసింది. అతన్ని వెనక్కి లాగింది.

"వందకోట్లు విలువ చేస్తాయి నా ప్రాణాలు అంటే నీకు గొప్పగా లేదూ?" అన్నాడు.

ఆమె భయం పోయి అందంగా నవ్వింది.

ఆస్ట్రేలియాలో ఒక చరణం, స్విజ్జర్లాండ్‌లో ఒక చరణం, ఇటలీలో బోటు మీద ఒక చరణం పాడుకున్నారు.

ఇక్కడే బడ్జెట్ ఇరవై కోట్లకి చేరింది.

హీరో బిజినెస్‌లో రకరకాల ఎత్తులేస్తాడు. పేదలకి సేవ చేస్తున్నాడు. ఈ స్మగ్లింగ్ మీదే బిలియన్స్ సంపాదించి ఏ నాటికైనా భారతదేశాన్ని వేలం పాటలో అమ్మకానికి పెడితే కొందామనుకునే ఇంకో పెద్ద విలన్ సోనూసూద్‌కి గుండె మండింది. హీరోని ఎలాగైనా చంపాలనుకున్నాడు.

ఈలోగా హీరోకి ఇంకో విషయం తెలిసింది. తనని వెతుక్కుంటూ తన సొంత తండ్రి వచ్చాడని. "నీకీ అప్పు తీర్చాల్సిన అవసరం లేదు. నాకు లక్షకోట్లున్నాయి. నీ పెంచిన తండ్రి ప్యాలెస్ విడిపిస్తా. నాతో వచ్చెయ్" అన్నాడు.

"నేను ప్రాణాలు రాసిచ్చా" అన్నాడు హీరో. అతను ఖంగు తిన్నాడు.

ఇతన్ని చంపడానికి వచ్చిన సోనూసూద్ మనుషులని ప్రకాష్ రాజ్ మనుషులు అడ్డుకున్నారు.

"అతని ప్రాణాలు ఆల్‌రెడీ మీకు తాకట్టుపెట్టాడు" అన్నారు.

ఈ ఘర్షణలో నీతికి నిలబడ్డ హీరో సోనూసూద్ నుండి ప్రకాష్ రాజ్‌ని రక్షించాడు.

హెలికాప్టర్ నుండి కిందకి తోసేస్తే అతన్ని, హీరో సముద్రంలో పడి సబ్‌మెరైన్ మీదుగా ప్రయాణించి, విలన్ స్థావరానికెళ్ళి, అక్కడ నీళ్ళల్లో బంధించి ఉంచిన ప్రకాష్‌రాజ్‌ని విడిపించి వందమంది బౌన్సర్స్‌ని నామరూపాలు లేకుండా చేసి, ఆ దీవి అంతా పెట్రోల్ పోసి తగుల బెట్టి తీసుకొచ్చేసరికి ప్రకాష్ రాజ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతనికి వెంటనే హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చెయ్యాలి అన్నారు డాక్టర్స్.

"నా గుండె తీసుకోండి" అన్నాడు హీరో.

"నాకు కావలిసింది నీ గుండె కాదురా" తన కొడుకుని పిలిచి "వీడికి నీ గుండెలో ఉన్న ధైర్యాన్ని ఇవ్వు చాలు.. వీడిని ఈ గ్యాంగ్ లీడర్ని చెయ్యి" అని కన్నుమూస్తాడు ప్రకాష్ రాజ్.

మధ్యలో హీరో హీరోయిన్‌తో అమెరికాలో, జర్మనీలో రెండు డ్యూయెట్లు పాడుకుని వచ్చాడు. షూటింగ్ అధిక శాతం మారిషస్‌లో జరుగుతుంది. పెద్ద హీరో కాబట్టి మొదట్లోనే బడ్జెట్ పన్నెండు కోట్లు పెరుగుతుంది. ఆ తరువాత ఇంకో ముప్పై కోట్లు...ఇదీ పెద్ద బడ్జెట్‌లో తీస్తే ఇలా ఉండేది. ఒకవేళ ఇలా పెద్ద బడ్జెట్‌తో సినిమా తీస్తే పేరు మాత్రం 'అందరి శత్రువయా' అని పెట్టాల్సొచ్చేదేమో.. ప్చ్....ప్చ్.. దేనికైనా రాసి పెట్టి ఉండాలండీ.

ఒకప్పుడు ఇలాగే రాజశ్రీ వాళ్ళు సచిన్‌ని హీరోగా పెట్టి అతి బీదగా 'నదియా కె పార్' అనే సినిమా తీశారు. నది అవతలి ఒడ్డున ఉన్న వదిన చెల్లెల్ని తన ఇంటికి తెప్పలో తీసుకెళ్ళటం హీరో పని. అక్క పురిటికి సాయంగా వచ్చిందాపిల్ల. అక్క మరిదితో ప్రేమలో పడింది. ఆ ఇంట్లో పెద్ద దిక్కు అక్క పినమామగారు. ఆయనకీవిషయాలు తెలియవు. అక్క పురిటిలో పోతే ఆ పిల్లాడిని పెంచటానికి ఈ

పిల్లకి బావనిచ్చి పెళ్ళిచేద్దామనుకుంటారు. కానీ అప్పటికే అక్క మరిదితో ప్రేమలో ఉన్న ఈ పిల్ల అటూ ఇటూ చెప్పలేక నలిగిపోతూ ఉంటుంది. బీదరికం, కుండలు, పూరిపాక, ఒక నదీ, తెప్పా ఇది ఆ సినిమా బడ్జెట్. ఇంత దిక్కుమాలినతనంగా ఆ సినిమా తీస్తే ఆడలేదు. అదే రాజశ్రీవాళ్ళు బ్రహ్మాండంగా భారీ బడ్జెట్ లో మాధురీ దీక్షిత్, సల్మాన్ ఖాన్, అలోక్ నాథ్, అనుపమ్ ఖేర్, రీమాలాగూ, మోనీష్ భేల్, రేణూ సహానీ, సతీష్ షా వీళ్ళని పెట్టి అదిరిపోయే మ్యూజిక్‌తో 'దీదీ తేరే దేవర్ దీవానా' అనేలాంటి పాటలతో పెళ్ళిపందిళ్ళు హోరెత్తిపోయేట్టు ఒక పెళ్ళి వీడియో ఆల్బమ్‌లాగా ఒక అపురూప దృశ్యకావ్యంలాగా 'హమ్ ఆప్ కె హై కౌన్' అని మళ్ళీ ఇదే సినిమా తీసారు. అది ఎంతటి విజయ ఢంకా మోగించిందో మీకు నేను చెప్పనక్కర్లేదు. ఇదీ భారీ తారాగాణం, భారీ బడ్జెట్ మహిమ.

మొన్న అల్లు అరవింద్ గారి ఆఫీసులో సత్యానంద్ గారితో కూర్చున్నప్పుడు ఆయన్ని కూడా మామూలు సినిమాకీ, కమర్షియల్ సినిమాకీ తేడా అడిగా. ఆయన చాలా హాస్య ప్రియులు.

"మామూలు సినిమా కథ మీరు మీ ఇంట్లోకూర్చుని రాసుకుంటారు, కమర్షియల్ సినిమా అప్పట్లో మద్రాస్‌లో 'పామ్‌గ్రోవ్‌లో' ఇప్పుడు వందకోట్ల సినిమా డైరెక్టర్లయితే 'వెస్టిన్' హోటల్లో రాసుకుంటారు" అని చెప్పారు.

"నేను కథ మామూలుగా ఒకరోజు అనుకుంటాను. రెండోరోజు సీనిక్ ఆర్డర్‌లా సీన్సు వేసుకుంటాను. మూడోరోజు ఎవరికైనా చెప్పేటంత మెటీరియల్, అంటే ప్రారంభం, ఇంటర్వెల్ పాయింటూ, ఎండింగూ చూసుకుంటాను. నాలుగురోజులు అనుకోండీ.. అంతే!" అన్నాను.

అరవింద్‌గారు ఇక్కడ కంగారు పడి "ఔను! ఒక్క రోజులోనే కథ చేసి నాకు చెప్తూ ఉంటుంది.. అంత ఫాస్ట్‌గా ఎలా?" అన్నారు.

సత్యానంద్‌గారు చిద్విలాసంగా నవ్వి "మేమూ అంతేనండీ. కానీ ఆర్నెల్ల నుండీ ఏడాది వరకూ కేవలం పెద్ద హీరోలని ఒప్పించడానికి పడ్తుంది" అన్నారు.

ఇది హాస్యంగా జరిగిన సంభాషణ అయినా ఇప్పటి హీరోల పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంది. పెద్ద హీరో అవక్కర్లేదు, ఒక్క సినిమా హిట్ అయితే చాలు, రెండో వాడికి చుక్కలు చూపిస్తున్నారు. ఒక హీరోని ఆడిషన్‌లో సెలెక్ట్ చేసేటప్పుడు నేనే వెళ్ళాను. ఆ డైరెక్టర్ వాడితో ఏదో బాండ్ రాయించుకున్నాడు. మూడు సినిమాలదాకా ఇతనికి వచ్చిన రెమ్యునరేషన్‌లో సగం ఇవ్వాలని. ఆ తర్వాత కొట్టి, కొరికి మొత్తానికి చేయించుకున్నాడు. సినిమా హిట్ అవకపోయినా ఈ హీరోకి వేషాలొచ్చాయి. అంతే.. ఇతని రెమ్యునరేషన్ తను మాట్లాడి ఇతని మీదపడి బతికెయ్యడం మొదలెట్టాడు ఆ డైరెక్టర్. అమాంతం అతను అంత డబ్బు డిమాండ్ చేసేటప్పటికి, మూవీ మొగల్ రామానాయుడుగారంతటి ఆయన ఆశ్చర్యపోయారు. ఇదీ సినీమాయ.

ఒక నిర్మాత చిన్న బడ్జెట్‌లో సినిమాలు చేస్తాడు. రోజూ షూటింగ్ అప్పుడు యూనిట్ వాళ్ళకి పొట్లాలు తెప్పించి పెడ్తాడుట. లెమన్ టీలో ఒక నిమ్మకాయ పిండితే.. దానితో నాలుగు కప్పులవ్వాలట. మా మేనేజర్లు ఇది చెప్పి 'ఉప్మా' కంపెనీ అని తెగహేళన చేసారు.

నాకు మాత్రం ఆ ప్రొడ్యూసర్ అంటే ఎంతో గౌరవం కలిగింది. ఆయన డెడికేషన్‌తో ఏక్టర్స్‌కి రిహార్సల్స్ ఇప్పించి చేయించిన ప్రతి చిత్రం అవార్డు సాధించింది. లోబడ్జెట్లో తియ్యడం, పరిశ్రమకి ఆదా చెయ్యడం తప్పా? హేళన చేసే విషయమా అనిపించింది.

ఒక డైరెక్టర్ ఉంటాడు. పుట్టగానే కెవ్వున ఏడ్చి "'బంగారు ఉయ్యాల' లేదా ఈ హాస్పిటల్లో? పైన తిరిగే ఏరియల్ కార్లో కాకుండా నేలమీద తిరిగే వాహనాల్లో నేను ఇంటికి రాను" అని ఉంటాడని నా నమ్మకం.

అతను వెస్టిన్ హోటల్‌లో తప్ప సిట్టింగ్స్ చెయ్యడు, రోజుకి పంతొమ్మిది వేలు.! సినిమా యాభై కోట్లు బడ్జెట్ అయితే, ఇతని ఖర్చే అందులో పన్నెండు దాకా ఉంటుంది. భార్య షాపింగ్ చెయ్యాలంటే యూ.ఎస్. వెళ్తుంది. సోప్ కొనాలంటే యూ.కె వెళ్తుంది. పిల్లాడు గూగుల్ గ్లాస్ కొనివ్వలేదని కిండర్ గార్డెన్ స్కూల్‌కి వెళ్ళనంటున్నాడట. ఇంకో ప్రొడ్యూసర్ యాభై లక్షల సిగరెట్ లైటర్ డైరెక్టర్‌కి

కొనిచ్చాడు. సిగరెట్ నుసి చేసినట్లే డబ్బులూ నుసి చేయమని. (ఆ ప్రొడ్యూసర్ నా మొదటి టెలీఫిల్మ్‌లో హీరో, అతనికి ఆ రోజుల్లో ఏక్ట్ చేసినందుకు పదిహేనువందలు ఇచ్చినట్లు గుర్తు. వెర్రివెంగళాయిలా కనిపించే మనిషి కావాలంటే, ఇతన్ని వెతికి పట్టుకొచ్చారు మా ప్రొడక్షన్ మేనేజర్లు)

ఇంక పాత ప్రొడ్యూసర్లుంటారు. వాళ్ళు ఇంకా ఎంబాసిడర్ కారులో పదిరూపాయలు పెట్రోల్ పోస్తే రోజంతా తిరగొచ్చు. "ఇడ్లీలోకి సాంబార్, చట్నీనే వేస్తాం. అల్లం చట్నీ, కారం పొడి, నెయ్యీ అడగకూడదు" అని హీరో చేత ఎగ్రిమెంట్ మీద సంతకం చేయించిన రోజుల్లోనే ఉండిపోయారు. రచయితలకి కూడా డబ్బులు ఇవ్వాలా? అన్నట్లుగా ఉంటాయి, వాళ్ళ బేరాలు.

హీరోయిన్ ఫస్ట్ అసిస్టెంట్‌కీ, సెకండ్ అసిస్టెంట్‌కీ కూడా ఫ్లయిట్ ఫేర్స్ ఇస్తారు. రచయితని రైల్లో రమ్మంటారు అవుట్ డోర్ షూటింగ్‌కి. కథ రాసిన వాళ్ళకి యాభైవేలు. అందులో ఐటెం డాన్స్ చేసిన అమ్మాయికి పదిలక్షలు. గట్టిగా కాఫీ రెండోసారి అడిగితే 'బడ్జెట్' సినిమా అంటారు.

టీ.వీ సీరియల్ స్క్రిప్ట్ రాసేటప్పుడు ప్రొడక్షన్ మేనేజర్ మన దగ్గర కొచ్చాడంటే, ఒకటే గుర్తు. మన స్క్రిప్ట్‌లో బడ్జెట్ ఎక్కువైందని పై నుండి తాఖీదులొచ్చినట్లు...

"అమ్మా.. భోజనాల బల్ల సీన్లు రాస్తే రాసారు. గారెలూ, మైసూర్‌పాక్, బాదుషా అని పేర్లు రాయకండి. అలాగే పండ్లు తీసుకురావడం, ఆపిల్ పండు ఎగరేసి పట్టుకోవడంలాంటివి తగ్గించండి. కావాలంటే కూరగాయలు పెట్టండి. ఆకుకూరలూ, బీన్స్, దొండకాయలు లాంటివి. నావి రేబాన్ గ్లాసెస్, అదిదాస్ షూస్, అని బ్రాండ్స్ వాడకండమ్మా. ఆ పేరంటానికి పదిమంది ముత్తైదువలు అని రాసారు. నలుగురితో సరిపెట్టొచ్చేమో! మీటింగ్ పాటల ప్రోగ్రామ్ వద్దమ్మా. జూనియర్ ఆర్టిస్ట్‌ల బత్తాలు పెరిగాయి" అని నసుగుతుంటారు.

అందుకే సాధారణంగా దూరదర్శన్ ప్రోగ్రామ్స్‌లో వేసే నాటకాల్లో ఆపసోపాలు పడ్తూ ఇద్దరు పెద్దమనుషులొచ్చి తెర వెనకనుండి "అబ్బబ్బా.. రాజుగారి మర్యాదలు ఏం చెప్పమంటారు. గుమ్మడికాయంత పెద్ద లడ్లు, పురిషెడు నిండా నెయ్యి, గోడకి కొట్టిన పిడకలంత అరిసెలు, ఎన్నికూరలూ.. ఎన్ని పిండి వంటలూ? తినలేక చచ్చాం అనుకో!" అని డైలాగ్స్ చెప్పించేస్తారు. అవన్నీ చూపించడానికి కాదు అనడానికే బడ్జెట్ ప్రోబ్లం వాళ్ళకి.

సెన్సార్ చేసేటప్పుడు ఎవరైనా "ఇది మరీ 'లో' బడ్జెట్ సినిమాలా ఉందండీ" అంటే "కాదు లోటు బడ్జెటే" అనేదాన్ని ఆ అమ్మాయిల మొహాలూ, బట్టలూ చూసి. పాపం కొంతమంది ఎందుకు సినిమాలు తీస్తారో నాకు అర్థం కాదు. మాసిన గెడ్డంతో, ముడతలు పడ్డ లాల్చీతో దీనంగా వచ్చి సెన్సార్‌కట్స్ వినడానికి కూర్చుంటారు. ఇతని ఇల్లూ, పిల్లనిచ్చిన మావగారిల్లూ, పక్కనున్న స్నేహితుడిల్లూ కూడా అమ్మేసి సినిమా తీసారని చూడగానే తెలుస్తుంది. ఒక ఐటెం డాన్స్ ఉంటే కుర్రకారొస్తారని కురచబట్టలు వేసి ఒక అమ్మాయి చేత గెంతిస్తారు, నాలుగు బూతులు డైలాగ్ రైటర్ చేత చకచకా రాయిస్తారు. యూత్ అంటే బూతు ఉండాలని లేకపోతే వాడు బతకలేడనీ ఈ డైరెక్టర్ కమ్ రైటర్ల స్థిరమైన అభిప్రాయం. అవి కాస్తా సెన్సార్ కత్తెర బారిన పడ్తాయి. ఇంక 'పీకడం, గోకడం, నాకడం' లాంటి పదాలు బూతుకాదనీ, ఇంకా ఘోరమైనవి కూడా బూతులోకి రావనీ వాదనకి దిగుతారు. ఆ అమ్మాయి బట్టల విషయానికొస్తే 'అలాంటివి బయటకూడా వేసుకుని తిరుగుతున్నారు మేడం' అని "నాతో రండి కావలిస్తే చూపిస్తా" అంటారు. డిజిటల్ వచ్చాకా అందరికీ సినిమా తియ్యడం ఈజీ అయిపోయింది. నలుగురు కుర్రాళ్ళు తల్లిదండ్రుల్ని అడిగి చెరి పాతికా తెచ్చి సినిమా తీసేస్తున్నారు. అవి ఎవరూ చూసేట్లుగా ఉండవు కానీ సినిమా ఏక్టర్లు అనిపించుకోవాలని తీసేస్తున్నారు.

ఇంక సినిమా కథ రాస్తే సరిపోదు అది తెరమీదకి రావాలంటే ఎంత గోలో. మధ్యలో ఎంత కథాకమామీషో తెలీక చాలామంది "మా దగ్గర సినిమాకి పనికొచ్చే మంచి కథలున్నాయి తీసుకోండి" అని సంచి భుజాన వేసుకుని వస్తుంటారు.

కథ వినిపించడానికే వీళ్ళకి 6 నెలలు పడ్తుంది. ప్రొడ్యూసర్ వింటూ ఆవలించినా, లోపలికి తొంగిచూసి "టీ చెప్పవోయ్" అన్నా, వేళ్ళు విరుచుకున్నా, వీళ్ళు ఇంక చెప్పడం ఆపేస్తే బెటర్. బోర్ కొట్టిందనమాట. ఒకవేళ నచ్చితే "బానే ఉన్నట్లుంది. రేపోసారి కలుస్తారా?" అంటారు. అప్పుడే తన కథకి కాళ్ళొచ్చి తెర ఎక్కేసినట్లు కలర్‌లో కలలు కనకూడదు. మర్నాడు నలుగురు ఉద్ధండ పండితులు అని తను అనుకునే తన స్నేహితులని పోగేసి మళ్ళీ కథ చెప్పమంటాడు. అదీ అవుతుంది. ఇద్దరు బావుందంటారు. ఇద్దరు బాలేదంటారు. తరువాత రోజు మళ్ళీ రమ్మంటారు. ఇంకో స్టెప్ దాటాం అనుకుని, చొక్కా ఇస్త్రీ చేయించుకుని, గెడ్డం చేయించుకుని రచయిత మళ్ళీ కాయితాల జోలితో వెళ్తాడు. ఈసారి ఇంట్లో ఆడవాళ్ళు వింటారు. బానే ఉంది. మళ్ళీ 50 పర్సెంటు ఓట్లు. చివరకి హీరో.... అతగాడు మధ్య మధ్యలో టీ.వీ.లో క్రికెట్ మ్యాచ్ చూస్తూనో, మెసేజ్‌లు ఇస్తూనో వింటాడు. అతని తల్లి లేదా తండ్రి శ్రద్ధగా వింటారు. మధ్య మధ్యలో రకరకాల సందేహాలు అడుగుతారు. టీ తెచ్చి పెట్టిన కుర్రాడిని ఒక్కోసారి "నీకెలా ఉందిరా?" అని కూడా అడుగుతారు. చివరకి "బావుందయ్యా" అంటే పంట పండిందన్నమాటే! కానీ మరుసటి రోజునుండీ హీరో తను చూసిన డీ.వీ.డీలో ఉన్న సీన్లు అన్నీ కావాలంటాడు. లేదా "హీరోని హీరోయిన్ చెంపమీద కొట్టడం ఏవిటీ? నేను చెయ్యను" అన్నాడు.

రచయిత మార్చాలి. "కథ ఇంత లో బడ్జెట్‌గా ఉందేవిటీ? కొంచెం బడ్జెట్ పెంచాలి" అంటాడు. వెంటనే మార్పులు మొదలు.

1) హీరో తల్లి గోరింటాకు రుబ్బుతూ పాటపాడదు.. పిల్లాడికి స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చూపిస్తూ అన్నం పెడ్తూ పాట పాడాలి.

2) హీరో చెల్లెలు తండ్రి కోపం వచ్చి తోసేస్తే రోటిమీద పడి మరణించదు. తండ్రి బాగా తాగి బి.ఎం.డబ్ల్యూలో వెళ్తూ చెట్టుకి గుద్దేస్తే, డోర్ ఊడి అక్కడ ఉన్న నయాగరా జలపాతంలో పడి మరణిస్తుంది.

3) హీరో తండ్రిని చిన్నప్పుడు కారు బొమ్మకొనివ్వమని పేచీ పెట్టడు. హెలీకాప్టర్ కొసం అలిగి ఇంట్లోంచి వెళ్ళిపోతాడు.

4) పెద్దయి పడిపోతున్న పూరిపాకకి కప్పు వేయించే సీను మార్చాలి. ఫలక్‌నామా ప్యాలెస్ కొని తల్లినీ తండ్రినీ ఇంటికి తీసుకొస్తాడు హెలీకాప్టర్‌లో.

5) విలన్ హీరోయిన్‌ని వేధిస్తుంటే, వెళ్ళి చేతులతో ఫైట్ చెయ్యడు. పెద్ద రోల్స్ రాయల్ కారులో వెళ్ళి, ఆకాశంలోకి దానితోపాటు ఎగిరి అక్కడ వరుసగా ఉన్న స్కై స్క్రేపర్స్ లోంచి చాలాసేపు ఆకాశంలో ప్రయాణించి, మధ్యలో స్విమింగ్ ఫూల్‌లో అమ్మాయిలతో జలకాలాడ్తున్న విలన్ దగ్గర ఆగి, తీరిగ్గా బాంబు తీసి, దాని పిన్ తన నోటితో పీకి, బౌలింగ్ చేసి విలన్ కేసి విసుర్తాడు.

6) మధ్యలో హీరోయిన్ తో "సంక్రాంతి వచ్చిందోయ్ మా పల్లెకి" లాంటి పాట ఉంటే తీసేసి "ఈఫిల్‌టవర్‌లో ఈగవా... చైనా వాల్ దగ్గర చీమవా?" అని జాగ్రఫీ అంతా కవర్ చేస్తూ స్టెప్పులేస్తాడు.

7) ఇంకా కావాలంటే డైరెక్టర్ సెట్టింగుల శేఖరుడైతే హీరోయిన్ హీరో 'బుర్జ్ కాలిఫానో' లేక 'తాజ్‌మహల్' సెట్లో వేసి ఒకపాట పెట్టించొచ్చు. దాంతో భారీ బడ్జెట్ చిత్రం రికార్డుల్లోకి ఎక్కుతుంది. విలన్స్‌ని, వెనక ఉండే చిల్లర విలన్స్‌నీ మొహం చూసుకోకుండా వెయ్యిమందిని పెట్టాలి. హీరో స్టెప్పులు బాగా వేస్తాడు కనుక ముగ్గురు హీరోయిన్లన్నా ఉండాలి. అందులో ఒకరు అంతర్జాతీయం, ఇంకొకరు పక్క రాష్ట్రం నుండి, ఒకరు స్వరాష్ట్రం లేదా స్వభాషనుండి అయితే సర్దుకుంటాడు.

ఈ రకంగా కథ రాయడానికి మనకి ఏంబియన్స్ అవసరం. పాలకూర పప్పులో పోపు పెడ్తూనో, మల్లెపందిరి కింద కుర్చీ వేసుకునో రాయకూడదు. అలా రాస్తేనే మరి సో కాల్డ్ మధ్యతరగతి కథలూ.. అప్పులు చేసే అప్పారావులూ, గుండెపోటొచ్చే గుర్నాధాలూ, పరోపకారం చేసే పాపన్నలూ, నిండా బొడ్డు కనిపించకుండా బట్టలు వేసుకునే హీరోయిన్లూ స్క్రిప్ట్‌లో కొచ్చేస్తారు అసహ్యంగా! ఏ బ్యాంకాకో వెళ్ళిపోవాలి. పక్కన విదేశీ పానీయాలుండాలి. ఖరీదైన మంచింగ్స్ ఉండాలి. ఇంకా ఏవైనా కూడా ప్రొడ్యూసర్ సమకూరిస్తే. స్క్రిప్ట్ మీద ఓ మూడు నెలలు కూర్చున్నాకా, వచ్చి జూబ్లీ హిల్స్‌లో ఓ ఖరీదైన బంగళాలో మళ్ళీ చుట్టూ పాతిక మంది వందిమాగధుల్ని

పెట్టుకుని మళ్ళీ కూర్చోవాలి. ఇద్దరూ అదేపనిగా డైరెక్టర్ ఏం మాట్లాడినా "భలే చెప్పారు గురూ.. స్టీవెన్ స్పీల్‌బర్గ్‌లా" అంటుంటారు. స్పీల్‌బర్గ్ కూడా వీళ్ళతోనే ప్రతి సీనూ డిస్కస్ చేసేట్లు.

ఇంకో ఇద్దరు అదేపనిగా సీ.డీ.లు చూస్తేస్తుంటారు. టైటానిక్ మునిగిపోవడం, మెకన్నాస్ గోల్డ్‌లో లాస్ట్ సీన్ కూడా కొత్తగా రాసేసుకుంటూ ఉంటారు. ఇంక అసిస్టెంట్ డైరెక్టర్లలో కాస్త చొరవ ఉన్నవాడు వచ్చిన ఫోటోలన్నీ చూసి అమ్మాయిలకి ఫోన్ చేసి పిలిపించి ఆడిషన్స్ తీసుకుంటుంటాడు, జూనియర్ ఆర్టిస్టుల కోసం. విధిగా జరిగిపోయేవి ప్రొద్దుట టిఫిన్లూ మధ్యాహ్నం భోజనాలూ, సాయంత్రం ఏ పూర్ణా మెస్ నుండో పునుగులూ, బజ్జీలూ, అరగంటకో టీ, సిగరెట్లూ... నెలకి పాతికవేలు ఆఫీస్ బంగళా రెంటూ.

"కథ ఎందాకా వచ్చింది?" అని ప్రొడ్యూసర్ వస్తే డైరెక్టర్ మూడ్ మారిపోతుంది. బోయ్‌ని పిలిచి "నీకేం పనీ పాటా లేదు్రటా? చెత్త వెధవా.. చెత్త వాగుడూ నువ్వూ" అని అనవసరంగా తిట్టేస్తాడు. దాంతో ప్రొడ్యూసర్ తోక ముడుచుకుని జారుకుంటాడు. ఒకవేళ కథ నాలుగు ముక్కలు చెప్పినా "ఇలా బావుండదేమో" అని ప్రొడ్యూసర్ అనబోతే "బాబు ఇలాగే కావాలంటున్నాడు" అని హీరో మీద తోసేస్తుంటారు.

మధ్యలో రాయల్ ఫ్యామిలీ వాళ్ళ పెళ్ళిలా ఆడియో ఫంక్షన్, సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్స్ ఉంటాయి. భారీ తారాగణం అయితే ప్రమోషన్ కూడా భారీగా ఉంటుంది. సక్సెస్ అయిందో లేదో తెలిసేలోగా నాలుగు సక్సెస్ మీట్లూ, ఒక జైత్రయాత్రా స్టేట్ అంతా జరిగిపోతాయి.

భారీ సినిమా అలా పూర్తి అవుతుంది. పందుం పొలం పోయినా కోర్టు వ్యవహారాలన్నీ తలకెక్కాయ్ నాకు.

అన్నీ పరాయి రాష్ట్రం నుండి అరువు తెచ్చుకునే ఈ హీరోలు, లేడీ రైటర్స్‌ని వాళ్ళు ప్రోత్సహించినట్లు ఇక్కడ ప్రోత్సహించరు, ఎందుచేతో?

Post your comments

